కథ

# స్త్రీ హృదయం

- టి. శ్రీవల్లీరాధిక

సత్యతో పెళ్ళి ఒక తీయటి కలలా జరిగింది వేణుకి. అందరూ 'పెళ్ళికూతురు చాలా బాగుంది' అన్నారు. ఆమె అందం కేవలం శారీరకం కాదు. మానసికం కూడా. ఆ ప్రేమ ఝరిలో మునిగీ... తేలి పరవశుడయ్యాడు వేణు.

ఆమె ప్రేమ... సున్నితత్వం... సహృదయం... 'ఒక స్త్రీ సాహచర్యం యింత బాగుంటుందా!' అనుకున్నాడు.

సంవత్సరం ఎలా గడిచిందో అర్థమయ్యేలోపే నిశాంత్ పుట్టాడు. తట్టుకోలేనంత ఆనందం కలుగుతోంది అతనికి. తన బిడ్డ అన్న భావం హృదయాన్ని పరవశింపచేస్తుంది.

అయితే అంత ఆనందంలోనూ చిన్న లోపం.

సత్య యిదివరకు వున్నంత ఆనందంగా వుండడం లేదు. ఏదో దిగులు కనిపిస్తోంది ఆమెలో, నిశాంత్ పుట్టాక.

ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లూ, బాధపడ్తున్నట్లూ కనిపిస్తోంది. కారణం అర్థం కాలేదతనికి.

ఎన్నిసార్లడిగినా 'ఏం లేదండీ!' అంటూ నవ్వేస్తోంది కానీ సరైన సమాధానం చెప్పడం లేదు.

ఆరోజు... ఆదివారం. వేణు బెడ్‌రూంలో కూర్చుని పేపర్ చదువుకుంటున్నాడు. సత్య కళ్ళు తుడుచుకుంటూ వడివడిగా లోపలికి వచ్చింది. అతన్ని చూసి ఒక్క క్షణం ఉలిక్కిపడి, మళ్ళీ సర్దుకుని, మెల్లగా నడిచివెళ్ళి మంచం మీద పడుకుంది, కుడిచేయి మడిచి, నుదుటి మీద పెట్టుకుని ఆలోచిస్తూ.

కాసేపు మౌనంగా ఆమెనే గమనించాడు వేణు. పేపర్ మడిచి ప్రక్కన పెట్టి, దగ్గరగా వెళ్ళి "ఏమయింది సత్యా!" అన్నాడు.

ఆమె తలత్రిప్పి అతనివైపొకసారి తదేకంగా చూసి పెదవి విప్పింది.

"ఏమండీ! అత్తయ్యగారు నిశాంత్‌ని అస్సలు ప్రేమగా చూడరండీ!"

వేణు నిశ్చేష్టుడయ్యాడు. ఆమె ప్రక్కనే కూర్చుని, "అదేమిటి సత్యా! ఇంత పెద్ద అనుమానం ఎందుకు వచ్చిందీ నీకసలు! తప్పు కదూ అలా ఆలోచించడం!" అన్నాడు లాలనగా.

ఉక్రోషంగా చూసింది సత్య. "నేను ఆలోచించడం లేదు. చూస్తున్నాను. ప్రతిరోజూ చూస్తున్నాను. ఆవిడ మన పిల్లాడ్ని ఎలా చూస్తోంది, మీ చెల్లెలి కొడుకుని ఎలా చూస్తోంది అన్న విషయం నేను ప్రతిరోజూ గమనిస్తున్నాను."

ఆ మాటలు యింకా ఆశ్చర్యపరచాయి వేణుని.

"అదేమిటి!" అన్నాడు.

"అవును. జానకి కొడుకుని చూసినట్లు మన నిశాంత్‌ని చూడదు ఆవిడ. ఇద్దరూ ఆవిడ మనవళ్ళే కదా! మరి మనోజ్ మీద ఎక్కువ ప్రేమ చూపించడం ఎందుకు? కూతురి కొడుకనేగా?"

"అదికాదు సత్యా..." అంటూ ఏదో చెప్పబోయాడు వేణు. కానీ ఏం చెప్పాలో అతనికే అర్థం కాలేదు.

తన వైవాహిక జీవితంలో ఏ చిన్న సమస్యనీ వూహించలేదు అతను. సత్య, అతని తల్లీ బాగానే వుండేవారు. ఆడపడచు జానకితో కూడా అప్పటివరకూ ఏ గొడవలు లేవు సత్యకి.

జానకి వేణు కంటే మూడేళ్ళు చిన్నది. అతని పెళ్ళికి ఒక వారం ముందే ఆమె పెళ్ళి జరిగింది. అదే వూర్లో, అదే వీధిలో నాలుగిళ్ళ అవతల కాపురం.

జానకికి కూడా ఒక మగపిల్లాడు. భర్త ఆఫీస్‌కి వెళ్ళగానే పిల్లాడ్ని తీసుకుని తల్లి దగ్గరకు వచ్చేస్తుంది రోజూ. మళ్ళీ సాయంత్రం అతను వచ్చేటైంకి వెళ్తుంది.

ఇలా అందరూ ఒకచోట వుండడమే సమస్యలకి మూలమేమో! నిట్టూర్చాడు వేణు.

ఇంతకీ అసలు యిదంతా సత్య అనుమానమేనా! నిజమేమైనా వుంది!

అతని ఆలోచన పూర్తి కాకముందే బయటినుంచి నిశాంత్ ఏడుపు వినిపించింది. "అమ్మాయ్ సత్యా! వీడు ఏడుస్తున్నాడు చూడు" అన్న తల్లి కేక కూడా.

వేణు వడివడిగా బయటకు వెళ్ళాడు. అక్కడ... నిశాంత్ పాకుతూ ఏదో అందుకోబోయినట్లున్నాడు... కుడిచేతి మీదికి వెల్లకిలా పడి లేవడం రాక... ఏడుస్తున్నాడు.

తల్లి సోఫాలో కూర్చుని కళ్ళజోడు సవరించుకుంటూ ఏదో పుస్తకం చదువుతోంది.

"ఏం చేస్తోందిరా అది! పిల్లాడు ఏడుస్తుంటే పట్టించుకోకుండా!" అంది వేణుని చూడగానే, ఏమాత్రం తడబాటు లేకుండా.

"పడుకుంది" పిల్లాడ్నెత్తుకుని లోపలికి తీసుకు వెళ్తూ జవాబు చెప్పాడు వేణు.

"ఈ వేళప్పుడు నిద్రేమిటి? పసి పిల్లాడి సంగతి చూసుకోకుండా! నేనేమో కూర్చుంటే లేవలేని దాన్ని. వాడు అటూ యిటూ పోతే తేవడం నావల్లనవుతుందా" వెనుకనుండి తల్లి మాటలు వినిపించినా సమాధానం చెప్పలేదు వేణు.

అంత కూర్చుంటే లేవలేని స్థితిలో తల్లి లేదని అతనికి తెలుసు.

ఒకవేళ... జానకి కొడుకు అలా పడిపోయుంటే... తల్లి తప్పకుండా లేచి వుండేదేనని అనిపించింది అతనికి కూడా.

ముడుచుకుని పడుకున్న సత్యప్రక్కనే బాబుని పడుకోబెట్టి, ప్రేమగా ఆమె ముంగురులు సవరించాడు.

మెల్లగా కళ్ళు తెరిచింది సత్య. తడిగా వున్న ఆమె కనురెప్పల్ని చూపుడు వేలితో సున్నితంగా తాకుతూ, "పిచ్చి పిల్లా! చూడు. ఏదో సిల్లీ విషయం పట్టుకుని ఏడుస్తూ కూర్చున్నావు" అన్నాడు.

"సిల్లీ విషయమా!" ఛర్రున చూసింది సత్య.

వేణు గతుక్కుమన్నాడు. నిజానికి అతని ఉద్దేశ్యం ఆ మాట అనాలని కాదు. "ఏమిటో! ఏదో అనబోయి ఏదో అనేశాడు. ఇప్పుడెలా!" అతను ఆలోచించే లోపే సత్య మాటలు వినిపించాయి.

"సిల్లీ విషయం పట్టుకుని ఆలోచించడం అంటారేమిటి? నేనేమీ తలబద్దలు కొట్టుకుని ఆలోచించ లేదు. కాస్త బాధపడ్డానంతే. మీరు ఎప్పుడూ చూడరు కాబట్టి మీకు తెలీదు. చూస్తే మీరూ బాధపడతారు."

"నిజమేలే" వెంటనే ఒప్పుకున్నాడు వేణు.

"ఇందాక మంచినీళ్ళ కోసం వంటగదిలోకి వెళ్తూ వీడ్ని ఒక్క క్షణం దివాన్ మీద పడుకోబెట్టాను. దాని మీద రబ్బర్ షీట్ లేదు. వీడు ఏమైనా చేస్తే పరుపు పాడవుతుంది. కరక్టే. కానీ ఒక్క క్షణంలోనే కొంప మునిగిపోతుందా! నేను వచ్చేసరికి వీడ్ని ఒక్క చేత్తో మొరటుగా లాగి క్రిందికి దింపుతున్నారు అత్తయ్యగారు. ఆవిడ మనవడేగా, ఒడిలోకి తీసుకోకూడదా. ఆ ఒక్క నిమిషం ముద్దుగా పట్టుకుని, నేను రాగానే అందించకూడదా. మనోజ్‌ని ఎన్నిసార్లు ఆ సోఫా మీద పడుకోబెట్టదు జానకి. అప్పుడు అలాగే లాగిపారేస్తున్నారా?"

వేణు మాట్లాడలేదు. మళ్ళీ పేపర్ అందుకుని చదవడానికి ప్రయత్నించాడు. చూపు పేపర్ మీద వున్నా మనసు అక్షరాల మీద నిలవలేదు.

"సాయంత్రం ఎన్ని గంటలకి బయల్దేరాలి?" అంది సత్య.

వేణు తలత్రిప్పి చూశాడు. ఆరోజు అతని మామయ్య కొడుకు పెళ్ళి.

"ఆరు గంటలకి వెళ్దామా!" అన్నాడు.

"ఊ... రాత్రికి వచ్చేస్తాంగా!"

"వచ్చేయచ్చు. పది గంటలకి కదా ముహూర్తం. పదకొండుకల్లా బయల్దేరి వచ్చేయచ్చు."

ఆ మాట వినగానే సత్య లేచి బీరువా దగ్గరికి వెళ్ళింది. "పట్టుచీర సెలక్షన్ కాబోలు." వేణు నవ్వుకున్నాడు.

ఒక పెద్ద హేండ్‌బాగ్ తీసి సర్దడం మొదలుపెట్టింది సత్య. తన ఆలోచనలు నాకు అంటించి, తను హాయిగా పని చేసుకుంటోంది అనుకున్నాడు. అతనికి నిజంగానే చాలా బాధగా వుంది. చెల్లెలి కొడుకు మీద వున్నంత ప్రేమ తల్లికి తన కొడుకు మీద లేదనుకుంటే - అది భరించలేని విషయంగానే తోస్తోంది.

సాయంత్రం ఆరు కాక ముందే వచ్చేశారు, జానకీ ఆమె భర్తా. అందరూ కలిసి పెళ్ళికి బయల్దేరారు.

కాస్త దూరం వెళ్ళగానే జానకి కొడుకు ఏడవటం మొదలుపెట్టాడు. "దాహం వేస్తున్నట్లుంది. మంచినీళ్ళు పట్టు" అంది సత్య.

"అయ్యో తేలేదు" అంది జానకి.

సత్య తన బాగ్‌లో నుంచి బాటిల్ తీసి అందించింది. "బాయిల్డ్ వాటర్. జాగ్రత్తగా పట్టు."

సత్య మాటలు విన్నదో లేదో కానీ, జానకి చాలా నిర్లక్ష్యంగా ఆ సీసాని పిల్లాడికి అందించింది. వాడు చాలా సహజంగా దాన్ని తిరగతిప్పి పట్టుకున్నాడు. నీళ్ళన్నీ నేలపాలయినాయి. అడుగున మిగిలిన రెండు చుక్కలూ వాడి దాహం తీర్చాయి.

ఖాళీ బాటిల్ బ్యాగ్‌లో పెట్టుకుంటూ సత్య నిట్టూర్చడాన్ని భయంగా గమనించాడు వేణు.

"సత్యకి కోపం వచ్చిందా!" అనుకున్నాడు. ఆమె మొహంలో చిరునవ్వు లేకపోవడం అన్న ఊహే భరించలేడు అతను.

ఎందుకైనా మంచిదని ఒక రెండడుగులు ముందు నడవడం మొదలుపెట్టాడు. పెళ్ళిమండపం చేరగానే ఆ సందడిలో యిక అన్నీ మరచిపోయాడు. మంగళ సూత్రధారణ అయింది. వధూవరులు తలంబ్రాలు పోసుకుంటూండగా ప్రక్కన అలికిడి అయింది. తల త్రిప్పి చూస్తే సత్య నిలబడి వుంది, చిరునవ్వుతో.

కుడిచేయి ఆమె భుజం చుట్టూ వేస్తూ "బాబేడీ!" అన్నాడు.

"అక్కడ పడుకోబెట్టాను" అంటూ సత్య దూరంగా చూసింది. అప్రయత్నంగా వేణు కూడా తల త్రిప్పాడు.


అక్కడ... ఒక చిన్న దుప్పటి మీద బోర్లా పడుకుని, అమాయకంగా నిద్రపోతున్న నిశాంత్‌ని యిద్దరూ మురిపెంగా చూశారు ఒక్క క్షణం.

వాళ్ళు మళ్ళా మండపం వైపు తల త్రిప్పబోతూండగా కనిపించింది ఆ దృశ్యం. వేణు తల్లి మనోజ్‌ని ఎత్తుకుని ముద్దాడుతూ అక్కడికి రావడం. ఇద్దరూ ఊపిరి బిగపట్టి అటువైపు చూశారు.

ఆమె మెల్లగా వచ్చింది. ఒక్క క్షణం నిద్రపోతున్న నిశాంత్‌ని చూసింది. ఆ తర్వాత వాడ్ని క్రిందికి తొప్పించి, ఆ దుప్పటి మీద మనోజ్‌ని పడుకోబెట్టింది.

"చూశారా!" అంది సత్య ఏడుపు బిగపట్టిన గొంతుతో.

"ఊ" అనేందుకు వేణుకు గొంతు పెగలలేదు.




పిల్లాడ్ని ఎత్తుకుని యింటికి ఎలా వచ్చాడో అతనికే తెలీదు. ఎవరి మొహంలోకీ చూడాలనిపించలేదు.

మర్నాడు ఆఫీసుకి వెళ్ళాక కూడా అలా అన్యమనస్కంగానే కూర్చుండిపోయాడు.

"ఏంటలా దిగులుగా వున్నావు?" అన్నాడు ప్రక్క సీట్లోని రామం.

వేణు ఒక్క క్షణం తటపటాయించాడు. ఆ తర్వాత ముందు రోజు జరిగినదంతా చెప్పాడు.

"మీ అమ్మగార్ని అడగకపోయావా' ఎందుకిలా చేశావని." అన్నాడతను.

వేణు పెదవి విరిచాడు. "ప్చ్.. దానివల్ల లాభం ఏముంది. మేము చూశాం అని తెలిస్తే తనని తాను ఏదో విధంగా సమర్థించుకుంటుంది. వాడికి జలుబు చేసింది, అందుకని దుప్పటిమీద పడుకోబెట్టాను అంటుంది. లేకపోతే మరొకటేదో చెప్తుంది. అయినా ఆవిడ గురించి కాదు నా ఆలోచన..."

"మరి...!"

"సత్య గురించి. మా అమ్మ ప్రవర్తన కొంచెం బాధ కలిగించిన మాట నిజమే కానీ నేను దాన్ని తట్టుకోగలను. సత్య... సత్య తట్టుకోలేదు. ఆమె చాలా సెన్సిటివ్. ఇన్నాళ్ళూ అమ్మతోనూ, జానకితోనూ చాలా బాగా వుండేది. ఇప్పుడిక అలా వుండలేదేమో!

వాళ్ళిద్దరితోనూ అయితే ఫర్లేదు. అసలు మనుషుల మీదే నమ్మకమూ, ప్రేమా పోగొట్టుకుంటుందేమో అని భయం వేస్తోంది."

"ఛ... వూర్కోరా" అన్నాడు రామం. "నువ్వు అన్నీ మరీ తీవ్రంగా ఆలోచిస్తావు. ఇలాంటి విషయాలన్నీ ఆడవాళ్ళకి మామూలే. నేను చెప్తున్నా కదా ఏ తల్లీ కూతురి పిల్లల్ని చూసినట్లు కొడుకు పిల్లల్ని చూడదు. రేపు మీ ఆవిడ అయినా ఆ వయసొచ్చేసరికి యిదంతా మర్చిపోయి, కూతురి కొడుకుని ముద్దు చేయకపోతే అడుగు."

వేణు ఆశ్చర్యపోయాడు ఈ కొత్త థియరీకి. "నిజమా!" అనుకున్నాడు. 'ఆడవాళ్ళందరూ అంతేనా!' అతనికి నమ్మబుద్ధి కాలేదు.

స్త్రీ హృదయాన్ని అంత తేలికగా తీసి పారేయడానికి అతని మనసు ఒప్పుకోలేదు.

ఇంటికొచ్చేసరికి .... వాకిట్లో తండ్రి పేపర్ చదువుకుంటూ కనిపించాడు.

"ఏరా! తొందరగా వచ్చేశావు!" అన్నాడు.

"వూరికే. అమ్మేది?"

"జానకితో కలిసి బయటికెళ్ళింది... పిల్లాడ్ని సత్య దగ్గర వదిలి."

వేణు ఆశ్చర్యంగా చూశాడు. మనోజ్‌ని సత్య దగ్గర వదిలారా. తన బిడ్డంటే ప్రేమలేని వారి పిల్లాడిని సత్య మాత్రం ప్రేమగా ఎలా చూస్తుంది?

చిరాకుగా లోపలికి అడుగు పెట్టాడు.

ముందు గదిలో సత్య కనబడలేదు. బెడ్‌రూంలో... వంట గదిలో... ఎక్కడా లేదు.

కంగారుగా వెతుకుతున్న వేణుకు వెన్నెలజల్లులా సత్య నవ్వు వినిపించింది. వంటగదికి వెనకవైపు వరండాలో నుంచి.

అక్కడికి వెళ్ళేసరికి.... రెండు వైపులా పిల్లలిద్దరినీ లవకుశుల్లా కూర్చోపెట్టుకుని, చిన్న గిన్నెలో పెరుగన్నం కలిపి తినిపిస్తున్న సత్య కనబడింది. చిట్టి చిట్టి చేతులతో ఒకళ్ళనొకళ్ళు తోసుకుంటూ కేరింతలు కొడుతున్న వాళ్ళిద్దరి బుగ్గల మీదా ముద్దులు కురిపిస్తూ...

ఆనందమూ దుఃఖమూ కలగలసిన భావంతో వేణు గుండె వణికింది.

"ఆడపడుచు కొడుకుమీద సత్య చూపించే మాత్రపు ప్రేమ, స్వంత మనవడి మీద అమ్మ చూపలేకపోవటం ఎంత దురదృష్టం!"

అలికిడి అయితే వెనక్కి తిరిగి చూశాడు. ఎప్పుడు వచ్చారో తల్లీ, చెల్లి వెనక నిలబడి ఆ దృశ్యమే చూస్తున్నారు. కొడుకు మొహంలోని భావాల్ని ఆ తల్లి చదవగలిగింది. కూతురు తన రక్తం, కోడలు పరాయిది అన్న భావనతో వున్న ఆ తల్లి... మాతృ హృదయం అంటే ఏమిటో కోడలి నుంచి తెలుసుకున్న ఆ తల్లి - కొడుకు వైపు చూడలేక తల వంచుకుంది.

❑